క్లుప్తంగా

కొత్తూరులో ప్రముఖుల పూజలు



విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు, అధికారులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పలువురు పోలీసు అధికారులు పూజలు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి, గుంటూరు జిల్లా అడిసినల్ ఎస్పీ వర్ధారెడ్డికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వారు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామి వారి చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. శేషవస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు.

అమరవీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోడుమూరు రూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతూ ప్రాణాలొదిలిన అమరవీరులకు ఆదివారం కోడుమూరులోని బీఆర్ అంబేడ్కర్ సర్కిల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఆంధ్రయ్య మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం అనేక మంది తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. వారి ప్రాణ త్యాగం ఫలితంగా నేడు ఎస్సీ వర్గీకరణ చట్టం రాబోతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు నాగేష్, రాజు, సిరిగిరి మద్దీ, లక్ష్మన్న, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా!



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థినులు

గడివేముల: స్థానిక రాజరాజేశ్వరి హైస్కూల్‌లో ఆదివారం ఫేర్వెల్ డే ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తూ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కరస్పాండెంట్ రామేశ్వరరావు కోరారు. ఏఓ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

ఆలయ గోపురం నుంచి పడి వ్యక్తికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు

బనగానపల్లె రూరల్: యాగంటి ఆలయ గోపురంపై ఉన్న విద్యుత్ వైర్లను తొలగిస్తుండగా ప్రమాదశాత్తు కిందపడి నరేంద్ర అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. మహాశివరాత్రి సందర్భంగా ఆలయ గోపురానికి విద్యుత్ లైట్లు వేశారు. ఆదివారం సాయంత్రం అవి తీసేందుకు చాగలమర్రి మండలం బోదనం గ్రామానికి చెందిన నరేంద్ర గోపురంపైకి ఎక్కి వైర్లను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ కిందపడ్డాడు. ఆలయ సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాలు, తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు వైద్యులు సిఫార్సు చేశారు.

సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు సుప్రేమానంద సరస్వతి

కర్నూలు కల్చరల్: విద్యార్థులకు చిన్నతనం నుంచే మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి పేర్కొన్నారు. వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో ఆదివారం బాలవికాస్ తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం మానవ సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వాటిని సరిచేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పిల్లలను సరైన మార్గంలో పెంచితే ఉత్తమ సమాజం నిర్మితమవుతుందన్నారు.

సన్నగిల్లుతున్న ఆశలు

- ఏటా తగ్గుతున్న వేరుశనగ సాగు విస్తీర్ణం
- పెరిగిపోతున్న పెట్టుబడి భారం
- నష్టాలతో కుదేలవుతున్న రైతులు



కల్లూరు: సంప్రదాయ పంట వేరుశనగా సాగుపై రైతులా ఆశలు సన్నగిలుతున్నాయి. ఈఏడాది మండలంలో యాపర్లపాడు, తడకనపల్లె, చెట్ల మల్లాపురం గ్రామాల్లో మాత్రమే వేరుశనగను అన్నదాతలు సాగు చేశారు. అది కూడా రబీ సీజన్‌లో కేవలం 60 ఎకరాల్లో మాత్రమే సాగైందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

పెరిగిపోతున్న పెట్టుబడి ఖర్చులు

ఇది వరకు రబీ సీజన్‌లో బోర్లు, బావుల, కింద హంద్రీనీవా కాలువ కింద విస్తారంగా వేరుశనగా సాగు చేసేవారు. ప్రస్తుతం విపరీతంగా పెరిగిన పెట్టుబడులు, ఇతర ఖర్చుల వల్ల నామమాత్రంగానే వేరుశనగ సాగు చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీల ఖర్చులు కలుపుకొని ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి ఖర్చు వస్తుంది. పెట్టుబడులు పెరిగిపోవడంతో రైతులు వేరుశనగా సాగుపై దృష్టి పెట్టడం లేదు. ఒక వేళ అప్పు చేసి సాగు చేసినా మార్కెట్‌లో సరైన ధర లభించడం లేదు. దీంతో మండలంలో ఏటేటా వేరుశనగా సాగు విస్తీర్ణం తగ్గుతోంది.

ఏటా తుగ్గుతున్న సాగు విస్తీర్ణం వివరాలు

ఏడాది	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
2019-2020	2,200
2020-2021	500
2021-2022	400
2022-2023	350
2023-2024	300
2024-2025	200

ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం లేదు

రబీలో రెండు ఎకరాల్లో వేరుశనగా సాగు చేసేవాడిని. రెండేళ్లగా ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో ఉల్లి, మినుము పంటలు వేస్తున్నాను. 2000 సంవత్సరం వరకు కర్నూలు మార్కెట్‌లో తడకపల్లెలో వర్షాధార కింద సాగు చేసిన వేరుశనగ పంటకు ప్రత్యేక గుర్తింపు ఉండేది. ప్రస్తుతం పెట్టుబడి ఖర్చులు పెరగడంతో పాటు వ్యవసాయ కూలీల ఖర్చులు అధికమయ్యాయి. దీంతో రైతులు ఇతర పంటలను సాగు చేస్తున్నారు.

– జి.సోమన్న, రైతు, తడకనపల్లె

పెట్టుబడులు కూడా రావడం లేదు

నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని అందుల్లో రెండు ఎకరాలు వేరుశనగా పంట సాగు చేశాను. రెండు వారాలు ఉంటే వేరుశనగా కొత ప్రారంభించాలి. పెట్టుబడి ఖర్చులతో పాటు కౌలు చెల్లించాలి. పంట దిగుబడి కోసం పక్క పొలం రైతుల నుంచి నీళ్ల తీసుకున్నాను. నీళ్ల ఇచ్చినందుకు రైతులకు కొంత మొత్తం చెల్లించాలి. గత ఏడాది సాగు చేయగా ఎకరాకు 20 సంచుల వరకు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది రెండు ఎకరాలు పంట దిగుబడి మొత్తం 20 సంచులు వస్తుందన్న నమ్మకం లేదు. మొత్తంగా ఈ ఏడాది నష్టంగా కనిపిస్తోంది.

– ఎర్రమల, రైతు, తడకనపల్లె

నేటి నుంచి ఉరుసు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో వెలసిన హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమూద్‌షా ఖాద్రీ ఉరుసు మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయాని దర్గా పీఠాధిపతులు షఫిఅల్లా షా ఖాద్రీ, కలిముల్లాషా ఖాద్రీ ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి గంధం, మంగళవారం ఉరుసు, బుధవారం జియారత్, కిస్తీతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

రేపు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో ఈనెల 4న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు చంద్రపాల్, కిష్టఫర్ ఆదివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు అదే రోజు సాయంత్రంలోగా రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9052216511, 6300071616 నంబర్లను సంప్రదించాలన్నారు.

కుక్కలు బాబోయ్.. కుక్కలు.!



గడివేములలో సంచరిస్తున్న కుక్కల గుంపు

గడివేముల: మండల కేంద్రం గడివేములతో పాటు దుర్వేశి, గడిగరేవుల, చిందుకూరు, బిలకలగూడూరు, కరిమద్దెల గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో వృద్ధులు, చిన్నపిల్లలు, వాహనదారులు రోడ్లపై వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల వెంటపడటంతో కిందపడి గాయాల పాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు ప్రజల వెంట పడి భయాందోళన కలిగిస్తున్నాయి. కొత్త వ్యక్తులు వీధుల్లో నడిచి వెళ్లేందుకు సాహసించడం లేదు. కుక్కలు వీధుల్లో అధికంగా సంచరించడమే గాకుండా చిన్న పిల్లల మీదకు వెళ్లి గాయాలపాలు చేస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గోదా గోకులం బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న గోదా గోకులం పరివారం

కర్నూలు కల్చరల్ : శ్రీరంగనాథ స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కర్నూలు నగర శివారులోని గోదా గోకులం శ్రీగోదా రంగనాయకి సమేత శ్రీరంగనాథ స్వామి దేవాలయం ద్వితీయ వార్షిక వేడుక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు విశ్వరూప సేవ, బాల భోగ నివేదన, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, విష్వక్సేనారాధన, రక్షాబంధనం, ధ్వజాధివాసం, తదితర కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం శేషవాహన సేవ ఉంటుందని గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజుగుప్త పేర్కొన్నారు. కార్యక్రమంలో గోదా గోకులం ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాలసుధాకర్, ఇటిక్యాల పుల్లయ్య, కృష్ణ మోహన్, రాంభూపాల్‌రెడ్డి, వేముల జనార్దన, రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

17 గొర్రెలు మృత్యువాత



మృతి చెందిన జీవాలు

ప్యాపిలి: మండల పరిధిలోని బూరుగల గ్రామంలో విషపూరిత మొక్కలు తిని 17 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన వెంకటేశ్ తన జీవాలను ఆదివారం మేతకోసం అడవికి తీసుకెళ్లాడు. అడవిలో విషపూరిత మొక్కలను తిన్న దాదాపు 150 జీవాలు అస్వస్థతకు గురయ్యాయి. వీటిలో 17 గొర్రెలు మృతి చెందాయి. సమాచారం అందుకున్న రాచర్ల పశువైద్యాధికారి హుసేన్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని అస్వస్థతకు గురైన గొర్రెలకు చికిత్స అందించగా అవి కోలుకుంటున్నాయి. మృతి చెందిన జీవాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ప్రభుత్వం తనకు ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

విద్యుత్ ప్రమాదంలో జొన్న చొప్ప దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న పాడి రైతులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరులో ఆదివారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో జొన్నచొప్ప దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన ప్రసాదరెడ్డి పొలం నుంచి చొప్పను ట్రాక్టర్‌లో వేసుకుని ఇంటికి వస్తుండగా గ్రామంలోని శివాలయం వద్ద కిందకు వేలాడుతున్న విద్యుత్‌వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. ప్రమాదం గుర్తించిన ట్రాక్టర్ డ్రైవర్ ట్రాలీ లిఫ్ట్ ఎత్తి చొప్ప టోపును కిందకు తోశాడు. చొప్ప పూర్తిగా దగ్ధం కావడమే కాకుండా పక్కనే కల్లాల్లో ఉన్న గడ్డివాములపై నిప్పు రవ్వలు పడ్డాయి. గడ్డివాముల్లో మంటలు వ్యాపించడంతో అప్రమత్తమైన పాడి రైతులు మంటలు ఆర్పారు. బనగానపల్లె ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా అదుపు చేశారు. శివాలయంలో వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో ఇదే ప్రాంతంలో మూడు అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయని ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి

కోడుమూరు రూరల్: సి.బెళగల్ మండలంలోని పోలకల్ హైస్కూల్‌లో చెట్టుకొమ్మ విరిగిపడిన ఘటనలో చికిత్స పొందుతూ మృతిచెందిన విద్యార్థిని శ్రీలేఖ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించి ఆదుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం కోడుమూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. గత శుక్రవారం పోలకల్ హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ జరుగుతుండగా చెట్టుకొమ్మ విరిగిపడడంతో విద్యార్థిని శ్రీలేఖ తీవ్రంగా గాయపడిందని, కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం స్పందించి మృతిచెందిన బాలిక కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించడంతో పాటు, గాయపడ్డ విద్యార్థులకు రూ.5లక్షలు చెల్లించాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు ఫిజియోథెరపి క్యాంప్

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో సోమవారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ జ్యోతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు ప్రతి సోమవారం ఫిజియోథెరపిస్టు వీరేష్ ఫిజియోథెరపీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ సభ్యుల్లోని దివ్యాంగులను భవిత కేంద్రానికి తీసుకొచ్చి ఫిజియోథెరపి చేయించుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలైనట్లు హైవే సిబ్బంది తెలిపారు. టమాట లోడ్‌తో నంద్యాల వైపు వెళ్తున్న వాహనం సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. డ్రైవర్ సరిచూసుకుంటుండగా వెనుక నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొనంతో డ్రైవర్‌కు గాయాలైనట్లు తెలిపారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రెండో రోజు కొనసాగిన దీక్షలు

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి, అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలల్లోని వ్యర్థ పదార్థాలు హంద్రీ నదిలోని రింగుబావిలో కలుస్తున్నాయని ఆయా కళాశాలల ఎదుట సీపీఎం నాయకులు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. దూపాడు గ్రామానికి చెందిన ప్రజలు దీక్ష శిబిరం వద్ద వంటావార్పు చేపట్టారు. సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, కృష్ణ, మధు తదితర నాయకులు డిమాండ్ చేశారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి నాయకులు ఆనంద్ బాబు, కాటికాపర్ల సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణ, డప్పు కళాకారుల సంఘం నాయకులు వెంకటేష్, చక్రపాణి తదితరులు సంఘీభావం తెలిపారు. కాగా సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు.

ఇద్దరికి గాయాలు

ఆలూరు రూరల్: మండలంలోని అరికెర గురుకుల పాఠశాల సమీపంలో ఆదివారం ఉదయం బైక్ అదుపుతప్పి కిందపడి ఇద్దరు యువకులు గాయపడ్డారు. హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన పంపాపతి,రాజు ఉదయం పని నిమిత్తం స్కూటర్‌పై ఆలూరుకు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా అరికెర గురుకుల పాఠశాల సమీపంలో బైక్ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. పంపాపతి తలకు తీవ్రగాయాలు కాగా.. రాజు స్వల్పంగా గాయపడ్డాడు.

హోరాహోరీగా ఎద్దుల బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు 22 ఎద్దుల జతలు పాల్గొన్నాయి. పోటీలను టీటీడీ పాలక మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్ ప్రారంభించారు. మొదటి ఎనిమిది స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.1.50 లక్షలు, రూ.1.30 లక్షలు, రూ.1.10 లక్షలు, రూ.90 వేలు, రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు.

సంగీత గురువు రంగముని సేవలు ప్రశంసనీయం



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న అతిథులు



శాస్త్రీయ నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

కర్నూలు కల్చరల్: సంగీత గురువు రంగముని సేవలు ప్రశంసనీయమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సంగీత గురువు రంగముని 8వ వర్ధంతి సభ జరిగింది. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, బీసీ సంఘం జాతీయ కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు, ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా, విద్యుత్ శాఖ ఏడీఈ సుబ్బన్న, మాట్లాడారు. కందుకూరి అవార్డు అందుకోవడంతో పాటు నంది నాటక పోటీలకు సంగీత గురువుగా పనిచేసిన కీర్తి రంగమునికి దక్కుతుందన్నారు. రంగ మాధురి అధ్యక్షులు వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర తరంగిని కార్యక్రమంలో పలువురు గాయకులు శాస్త్రీయ సంగీతాన్ని ఆలపించారు. శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అలరించాయి. పలువురు కళాకారులు, సాహితీ వేత్తలను సన్మానించారు. కార్యక్రమంలో బాల సాహిత్య రచయిత హరికిషన్, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు బసవరాజు, కన్వీనర్ జేఎస్ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం



పల్‌దొడ్డి బాలమ్మబావి వద్ద రక్షణగోడ లేకుండా జరుగుతున్న రోడ్డు పనులు

సి.బెళగల్: మండలంలోని కొత్తకోట గ్రామం నుంచి కొండాపురం గ్రామం వరకు ఆర్అండ్‌బీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. అయితే పల్‌దొడ్డి గ్రామ శివారులోని ఆంజనేయస్వామి ఆలయం వద్దనున్న బాలమ్మ బావి దగ్గర చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో కనీస రక్షణ చర్యలు తీసుకోకుండా పనులు జరుగుతుండడంపై ప్రజలు, వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బావికి రక్షణ గోడ ఏర్పాటు చేయకుండా పక్క వరకు రోడ్డు నిర్మిస్తున్నారు. కనీసం ఎలాంటి హెచ్చరిక బోర్డులు, రక్షణ చర్యలు లేకుండా బావి గట్టుపై సైతం కంకరను పరచడం అధికారులు, నిర్మాణ సంస్థల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. బావి వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చికెన్ వ్యాపారం డీలా

- బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ తినని ప్రజలు
- పడిపోయిన వ్యాపారాలు
- లబోదిబోమంటున్న దుకాణదారులు



వ్యాపారం లేక వెలవెలబోతున్న చికెన్ దుకాణం

కోడుమూరు రూరల్: బర్డ్ ఫ్లూ భయంతో చాలా మంది చికెన్ పెద్దగా కొనడం లేదు. దీంతో వ్యాపారం లేక చికెన్ దుకాణాలు వెలవెలబోతున్నాయి. కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో సుమారు 120కుపైగా చికెన్ దుకాణాలున్నాయి. వీరంతా ప్రతి రోజు కోళ్ల ఫారాల నుంచి కోళ్లను తెప్పించుకుని ప్రజలకు విక్రయిస్తుంటారు. ఆదివారం వచ్చిందంటే చికెన్ ముక్క లేనిదే ముద్ద తినని చాలామంది ప్రజలు బర్డ్‌ఫ్లూ భయంతో గత మూడు వారాల నుంచి చికెన్ తినడం మానేశారు. అలాగే నాన్ వెజ్ హోటళ్లకు వ్యాపారం భారీగా తగ్గిపోయింది. దీంతో వ్యాపారం లేకపోవడంతో చికెన్ దుకాణాలు వెలవెలబోతుండగా, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారం లేకపోవడంతో తెచ్చుకున్న కోళ్లు కూడా పోని పరిస్థితి నెలకొందని, రోజు వారి వేతనం కూడా పడకపోవడంతో దుకాణాలకు అద్దెలు కట్టేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చికెన్ వ్యాపారులు వాపోతున్నారు.

మటన్, చేపలకు పెరిగిన డిమాండ్

బర్డ్‌ఫ్లూతో చికెన్ కొనలేని చాలా మంది మటన్, చేపలు విపరీతంగా కొంటుండడంతో మటన్, చేపలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మార్కెట్లో కిలో మటన్ రూ.800 నుంచి రూ.900 పలుకుతుండగా, చేపలు కిలో రూ.180 నుంచి రూ.200 పలుకుతోంది. మటన్ కొనలేని చాలామంది ప్రజలు ప్రస్తుతం ఎక్కువగా చేపలను తింటున్నారు.

వ్యాపారం బాగా తగ్గిపోయింది



బర్డ్‌ఫ్లూ భయంతో చాలామంది చికెన్‌ను సరిగ్గా కొనడం లేదు. మన ప్రాంతంలో బర్డ్‌ఫ్లూ లేనప్పటికీ కొంతమంది గతంలో మాదిరి చికెన్‌ను కొనడం లేదు. గతంలో ఆదివారం వస్తే 150నుంచి 180కిలోలు అమ్మితే ప్రస్తుతం 50నుంచి 80కిలోలు కూడా పోవడం లేదు.

–బడేసా, చికెన్ వ్యాపారి, కోడుమూరు